E-KABURU

# ఈ-కబురు

23-02-2025 ఆదివారం హైదరాబాద్ ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం www.ekaburu.com

కేక పుట్టిస్తున్న ఓదెల 2 టీజర్

6లో





# బీసీ కులగణన.. దేశానికే ఆదర్శం

రాహుల్ సంకల్పమే దీనికి ప్రేరణ

దేశంలోనే తొలిసారి పక్కాగా లెక్క

సీఎంగా నిర్వహించటం నా అదృష్టం

బీసీలపై బీఆర్ఎస్ దొంగలెక్కలు

రాజకీయ లబ్ధికే విపక్షాల విమర్శలు

బీసీ నేతల భేటీలో సీఎం రేవంత్



**హైదరాబాద్, ఈ-కబురు:** దేశవ్యాప్తంగా కుల కులగణన చేపట్టాలన్న రాహుల్ గాంధీ సంకల్పం మేరకే తెలంగాణలో విజయవంతంగా బీసీ కులగణన చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. శనివారం ప్రజాభవన్‌లో బీసీ సంఘాల నేతలతో సీఎం సమావేశమయ్యారు. ఎందరో సీఎంలుగా పనిచేసినా, ఎవరికీ రాని అవకాశం తనకు బీసీ కులగణన రూపంలో వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల వేళ.. కాంగ్రెస్ సాధించిన ఈ విజయాన్ని మిగతా 2లో

# మిర్చి రైతులు ఆందోళన చెందొద్దు

చైనా, థాయిలాండ్, మలేసియాకు మిర్చి ఎగుమతులు

పంటకు సరైన ధర దక్కేందుకు మార్గాలు అన్వేషించండి

రైతులకు ట్రేడర్లు ఇబ్బందులు కలిగించొద్దు

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

మిర్చి రైతులు, ఎగుమతిదారులతో సీఎం సమావేశం

2లో





2లో

## రంకెలు ఆపి.. లెక్కలు తేల్చండి

కాంగ్రెస్ తీరుతో పదేళ్ల ప్రగతి మాయం

సీఎం రేవంత్ తీరుతో రాష్ట్రానికి నష్టం

అప్పులపై సీఎం రేవంత్ అబద్ధాలు

ప్రాజెక్టులను పండబెట్టి.. పొలాలు ఎండబెట్టారు

సర్కారు తీరుతో రైతాంగం ఆగమాగం

సీఎం, బండి సంజయ్.. ఆర్ఎస్ బ్రదర్స్

## నోరెత్తితే.. నీ చిట్టా విప్పుతా

ఉద్యమంలో ఫొటోలకు పోజులు

తండ్రి పేరుతో రాజకీయాల్లోకి రాలేదు

నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేశా

కేటీఆర్, రేవంత్ ఇద్దరూ అవినీతిపరులే

ఆర్ఎస్ బ్రదర్స్ కాదు.. కేఆర్ బ్రదర్స్

కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, ఈ-కబురు:** తండ్రిపేరుతో రాజకీయాల్లోకి వచ్చి, ఉద్యమకాలంలో ఫోటోలకు పోజులిచ్చి, పదేళ్ల పాటు పదవులు అనుభవించిన కేటీఆర్ అధికారం పోవటంతో అసహనానికి లోనవుతున్నాడని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. శనివారం ఆయన మిగతా 2లో



## గ్రూప్-2 యథాతథం

పరీక్షను వాయిదా వేయలేం

కోడ్ అమలులో ఉన్నందున సాధ్యం కాదు

అభ్యర్థులు హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్

**అమరావతి, ఈ-కబురు:** ఏపీ గ్రూప్-2 పరీక్షలు ఈ నెల 23న (నేడు) యథాతథంగా నిర్వహించనున్నట్లు ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఇటీవల ఈ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వచ్చిన వార్తలపై మిగతా 2లో



## ఎఫ్‌బీఐ బాస్‌గా కాష్ పటేల్

9న డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

భగవద్గీత మీద ప్రమాణం చేసిన పటేల్

గర్ల్ ఫ్రెండ్ విల్కిన్స్ సమక్షంలో పదవిలోకి

2లో

## తెలంగాణలో కొలువుల జాతర

మహిళా శిశు సంక్షేమశాఖలో ఉద్యోగాల భర్తీ

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం

14236 పోస్టులకు త్వరలో నోటిఫికేషన్



**హైదరాబాద్, ఈ-కబురు:** తెలంగాణలో మహిళా నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మహిళా శిశుసంక్షేమ శాఖలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం కసరత్తు మిగతా 2లో



**నాగర్ కర్నూల్, ఈ-కబురు:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద ఊహించని ప్రమాదం చోటు చేసుకుంది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ ఎడమవైపు సొరంగం పనులు జరుగుతుండగా సుమారు 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పై కప్పు పడిపోయింది. శనివారం మిగతా 2లో

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదం

శనివారం ఉదయం ఘటన

3 మీటర్ల మేర కూలిన కప్పు

సొరంగంలోనే 8 మంది సిబ్బంది

బయటకు పరిగెత్తిన మరో 42 మంది

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

మంత్రుల పర్యవేక్షణలో రెస్క్యూ ఆపరేషన్



## ఎన్ఈపీ' అమలు ప్రసక్తే లేదు

రూ.10వేల కోట్లు ఇచ్చినా అంగీకరించేది

హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం

భారతీయ భాషల మధ్య మంటలు పెట్టొద్దు

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

2లో

# రంకెలు ఆపి.. లెక్కలు తేల్చండి

**హైదరాబాద్, ఈ-కబురు:** తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి వీరంగాలు మాని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పాలన చేతగాని ముఖ్యమంత్రి మూలంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన విజయాలన్నీ నీరుగారిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సొంత రాష్ట్రాన్ని సీఎం కేన్సర్‌తో పోల్చటంపై మండిపడ్డారు.




**సర్కారులో తలోమాట..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భట్టి విక్రమార్క వాస్తవాలు చెప్పారని కేటీఆర్ అభినందించారు. నెలనెలా గత అప్పులకు వడ్డీ రూపంలో నెలకు..రూ. 6500 కోట్లు చెల్లిస్తున్నామని ఇన్నాళ్లుగా సీఎం రేవంత్ చెబుతుండగా, ఫిబ్రవరి 17 నాటి ఆర్థికమంత్రి భట్టి విడుదల చేసిన నివేదకలో ఇది రూ. 2200 కోట్లుగా ఉందని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్‌ను బద్నాం చేయటానికే అబద్దాలు చెబుతూ తెలంగాణ పరువును గంగ పాలు చేశారన్నారు. ఒకే ప్రభుత్వంలో రెండు మాటలు ఎలా ఉంటాయంటూ ఆశ్చర్యం వక్తం చేశారు.

**సంపద పెంచాం..**

తెలంగాణ ఉద్యమాన్ని నడిపి, ప్రజల మద్దతుతో సీఎం పీఠమెక్కి, తన పదేళ్ల కాలంలో రాష్ట్ర సంపదను పెంచిన నేత.. కేసీఆర్ అని కేటీఆర్ అన్నారు. కానీ, రేవంత్ రెడ్డి ఓ యాక్సిడెంటల్ సీఎం అని అన్నారు. 14 నెలలుగా అబద్ధాలతో కాలక్షేపం చేస్తున్న సీఎం.. ఇకనైనా కేసీఆర్‌ను విమర్శించటం మానుకుంటే మంచిదని కేటీఆర్ హెచ్చరించారు.

**కాంగ్రెస్ తెచ్చిన కరువు**

ఫిబ్రవరి నెలలో ఎండలు పెరగటం వల్ల భూగర్భ జలాలు అడుగంటాయని, కనుక నీళ్లుంటేనే పంటలు వేసుకోవాలని..రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏడాదిగా ఎండబెట్టి.. రిజర్వాయర్లను పండబెట్టడం వల్లే కేవలం ఏడాది కాలంలోనే రాష్ట్రంలో భూగర్భజలాలు అడుగంటాయిని, సమైక్యరాష్ట్రం నాటి దుస్థితి నేడు తెలంగాణ రైతాంగానికి దాపురించిందని కేటీఆర్ మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని, నీళ్ళు ఇచ్చుడు చేతకాకుంటే క్రాప్ హాలిడే ప్రకటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**కమీషన్ల కక్కుర్తి వల్లనే..**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డినే వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల వేటలో పర్యవేక్షణను గాలికొదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడిపోవడం వల్లే ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఈ వరుస వైఫల్యాలపై ఇప్పుడు ఏం చెబుతారన్నారు.

**సీఎంకి.. బండి మద్దతు**

కేంద్రమంత్రి బండి సంజయ్‌పైనా కేటీఆర్ ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలబడుతున్నారన్నారు. రేవంత్, సంజయ్‌లు.. ఆర్ఎస్ బ్రదర్స్ అనే ప్రచారం సాగుతోందని, అది నిజం కాకుంటే.. తెలంగాణలోని అవినీతిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్లు, పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ విషయంలో బీజేపీ మౌనం దాల్చిందని, మేఘా కృష్ణారెడ్డినీ ఆ పార్టీ కాపాడుతోందని నిలదీశారు. కృష్ణజలల దోపిడీపై అసెంబ్లీలో ఎండగడుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.




## ఎన్ఈపీ' అమలు ప్రసక్తే లేదు

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** జాతీయ విద్యావిధానాన్ని (ఎన్ఈపీ) తమిళనాడులో అమలు చేసే ప్రసక్తే లేదని సీఎం ఎంకే స్టాలిన్ మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్రం రూ. 10 వేల కోట్లు మంజూరు చేసినా అంగీకరించేది లేదన్నారు. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నమే కాకుండా.. విద్యార్థుల భవిష్యత్, సామాజిక న్యాయవ్యవస్థపై ప్రభావం చూపే అనేక అంశాలు ఉండటం వల్లే 'ఎన్ఈపీ'ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భారతీయ భాషల మధ్య మంటలు పెట్టొద్దంటూ ప్రధాని మోదీ హితబోధ చేసిన వేళ.. కడలూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఏ భాషనూ వ్యతిరేకం కాదు..**

తాము ఏ భాషనూ వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. కేవలం హిందీ కోణంలోనే కాకుండా.. ఎన్ఈపీపై వ్యతిరేకతకు ఇతరత్రా అనేక కారణాలూ ఉన్నాయని, నీట్ మాదిరిగానే ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో ప్రవేశాలకూ పరీక్షలు రాయాల్సి వస్తుందన్నారు. విద్యార్థులను చదువుల నుంచి దూరం చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇప్పుడు అందుతున్న ఆర్థిక సాయాన్ని అడ్డుకుంటుందన్నారు. 'ఎన్ఈపీ'ని అమలు చేస్తే రాష్ట్రానికి రూ. 2 వేల కోట్లు వస్తాయని కేంద్రం చెబుతోందని, రూ. 10 వేల కోట్లు ఇచ్చినా అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తమిళనాడును రెండు వేల ఏళ్లు వెనక్కి నెట్టే పనిని చేయనని సీఎం వ్యాఖ్యానించారు.

**తమిళనాడు, కేంద్రం మధ్య వివాదం**

జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం తీవ్ర రూపం దాల్చుతోంది. ఎన్ఈపీ పేరుతో హిందీని తమపై బలవంతంగా రుద్దేందుకు యత్నిస్తున్నారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేశారని తమిళనాడు సీఎం ఆరోపిస్తుండగా, రాజకీయ కోణంలో చూడవద్దంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి కోరారు. తేనెతుట్టెపై రాళ్లు వేయవద్దంటూ స్టాలిన్ ఘాటుగా ప్రతిస్పందించిన నేపథ్యంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషల మధ్య మంటలు పెట్టొద్దంటూ ప్రధాని హితబోధ చేశారు. దేశ భాషల మధ్య ఎన్నడూ వైరం లేదని, అవన్నీ పరస్పరం చేయూతనందించుకుంటూ సుసంపన్నమయ్యాయని తెలిపారు.

# గ్రూప్-2 యథాతథం

మొదటి పేజి తరువాయి

ఏపీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలను తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. గ్రూప్-2 పరీక్షలకు సంబంధించిన అన్నిఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర వివరాలను అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో చూసుకోవాలని కమిషన్ తెలిపింది.

**పరీక్ష సమయం..**

ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుందని ఏపీపీఎస్సీ అధికారులు ధ్రువీకరించారు. అభ్యర్థులు 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, 92,250 మంది మెయిన్స్ పరీక్షకు హాజరు కానున్నారు.

**కారణమిదే..**

ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున, ఈ సమయంలో గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కమిషన్ పేర్కొంది. కోడ్ ప్రకారం ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పరీక్షలు వాయిదా వేయడం వంటి చర్యలు తీసుకోవడం నిషిద్ధం. అందువల్ల గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయడం సాధ్యం కాదని కమిషన్ స్పష్టం చేసింది. ఈ ప్రకటనపై గ్రూప్-2 అభ్యర్థులు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. ఈ పరీక్ష కోసం ప్రిపేర్ అయిన అభ్యర్థులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, సరిగా ప్రిపేర్ కానీ వారు మాత్రం నిరాశపడుతున్నారు.

**అభ్యర్థులకు సూచన..**

గ్రూప్-2 పరీక్షలు ఏపీ వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నిర్వహించబడనున్నాయి. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో ఉన్న సమాచారం ఆధారంగా తమ పరీక్షా కేంద్రాలను చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి చేరుకోవాలని, అవసరమైన పత్రాలను కూడా తీసుకురావాలని కమిషన్ ఈ సందర్భంగా సూచించింది. ఏపీపీఎస్సీ అభ్యర్థుల పరీక్షకు సంబంధించిన సమాచారాన్ని తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలైనా ఉంటే, వారు కమిషన్ అధికారిక నంబర్ లేదా ఇమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపింది.

**ఏర్పాట్లు పూర్తి..**

ఈ నేపథ్యంలో నేడు జరిగే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల కోసం అభ్యర్థులు తమ సన్నాహాలను పూర్తిచేసుకోవాలని కమిషన్ సూచనలు జారీ చేసింది. పరీక్షకు హాజరయ్యే సమయంలో నిబంధనలను పాటించాలని సూచించింది. మరోవైపు ఏపీపీఎస్సీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది.

## ఎఫ్‌బీఐ బాస్‌గా కాష్ పటేల్

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** అమెరికా జాతీయ దర్యాప్తు సంస్థ (ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) తొమ్మిదవ డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన కాష్ పటేల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శనివారం వాషింగ్టన్‌లోని వైట్ హౌస్ క్యాంపస్‌లో గల ఐసెన్‌హోవర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ బిల్డింగ్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అటార్నీ జనరల్ పామ్ బోండీ కాష్ పటేల్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. భారతీయ మూలాలు ఉన్న కాష్ పటేల్ భగవద్గీతపై ప్రమాణం చేయడం విశేషం. ప్రమాణం పూర్తి కాగానే కాష్.. బాధ్యతలు స్వీకరించారు. సంస్థ హెడ్డాఫీసులోని 1000 మంది ఉద్యోగులను ఫీల్డ్ ఆఫీస్‌లకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు. మరో 500 మందిని హంట్స్ విల్లే, అలబామాలోని సెంటర్‌కు పంపుతామని తెలిపారు. అమెరికన్లకు హాని చేసే ఏ వ్యక్తినైనా ఎక్కడ దాక్కున్నా.. వెంటాడి అంతమొందిస్తామని పటేల్ హెచ్చరించారు. ఎఫ్‌బీఐ సంస్థను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించి, బలోపేతం చేస్తానని ఆయన ప్రకటించారు. కాగా, ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా భారత సంతతి నేత కాష్ పటేల్‌ను నిన్న 51-49 ఓట్లతో యూఎస్ సెనేట్ గురువారం ఆమోదించిన విషయం తెలిసిందే. కాష్ పటేల్‌కు తన మద్దతు ఎప్పటికీ ఉంటుందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు.

**గుజరాతీ మూలాలు..**

అమెరికాలోని న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీకి చెందిన కాష్.. అక్కడే పుట్టినా, ఆయన తల్లిదండ్రులు గుజరాత్ నుంచి వెళ్లి అక్కడ స్థిరపడినవారే. కాష్ తండ్రి విమానయాన సంస్థ ఉద్యోగిగా పనిచేశారు. కాష్ పటేల్.. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడనే పేరుంది. కాష్ రిచ్మండ్ యూనివర్సిటీ నుంచి హిస్టర్, క్రిమినల్ జస్టిస్‌లో డిగ్రీ పొందిన కాష్.. పేస్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి జేడీ కూడా పొందారు. గతంలో అమెరికా ప్రెసిడెంట్‌కు డిప్యూటీ అసిస్టెంట్‌గా, ఎన్ఎస్‌సీ(నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్)లో ఉగ్రవాద నిరోధన విభాగానికి సీనియర్ డైరెక్టర్‌గా పనిచేశారు. కాగా, ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత మద్దతుదారులకు కీలక పదవులు కట్టబెట్టారు.

# మిర్చి రైతులు ఆందోళన చెందొద్దు

**అమరావతి, ఈ-కబురు:** ఏపీలో మిర్చి రైతుల సమస్యలపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. మిర్చి ధరలపై రైతులు, ఎగుమతిదారుల తో సీఎం చర్చించారు. చైనా, థాయిలాండ్, మలేసియా తదితర దేశాలకు మిర్చి ఎగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో మిర్చి పంటకు స్థిరైన ధర దక్కేందుకు ఉన్న మార్గాలను అన్వేషించాలని సీఎం ఆదేశించారు. గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి నిల్వలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, మార్కెటింగ్ శాఖ అధికారులు హాజరయ్యారు.

**వైఎస్ జగన్ డిమాండ్..**

మిర్చి ధర నిర్ణయించాలని వైసీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయిన సంగతి తెలిసిందే. ధరలు పడిపోయి ఇబ్బందులు పడుతున్న ఏపీ మిర్చి రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబు చేసిన విజ్ఞప్తులకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఆ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి చర్చించారు. ఇందులో ప్రధానంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కొనుగోలు చేసి మార్కెట్ ధర- సాగు ఖర్చుకు మధ్య ఉన్న తేడాను కేంద్రం చెల్లించడం, ఎంఐఎస్ కింద సేకరించే సరకు గరిష్ఠ పరిమితిని 25శాతం నుంచి 75శాతం వరకు పెంచడం, మిర్చి సాగు వ్యయాన్ని ఐకార్ నిర్ణయించిన ధర ప్రకారం కాకుండా ఏపీ ప్రభుత్వం ఖరారు చేసిన రూ. 11,600ని పరిగణనలోకి తీసుకోవడం, ఎగుమతులకు ఉన్న అడ్డంకులను తొలగించడంపైనే చర్చించారు. ఇందులో తొలి మూడు డిమాండ్లకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

**చైనా, థాయిలాండ్, మలేసియాకు మిర్చి ఎగుమతులు..**

ఏపీ నుంచి మిర్చి ఎగుమతి అయ్యే శ్రీలంక, మలేషియా, చైనా దేశాల్లో కూడా మిర్చిని సొంతంగా పండించడంతో ధర తగ్గిందని భావించినప్పటికీ అక్కడ పంట సరిగ్గా రాకపోవడంతో రానున్న రోజుల్లో మిర్చి ధర భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయాలన్నింటినీ ట్రేడర్స్‌కు వివరించడంతోపాటు, రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని, సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని సీఎం హామీనిచ్చారు. మిర్చి ధర నిర్ణయిస్తే ఆ ధరకే కొంటామని ట్రేడర్లు చెప్పారు. దీంతో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్నివైపుల నుంచి చర్యలు తీసుకుంటోంది. సీఎం స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చించారు. అలాగే తాజాగా ట్రేడర్లతో సీఎం భేటీ కావడంతో మిర్చి ధరల విషయంలో ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా చూసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని చెప్పారు.

**రెండు లక్షల ఎకరాల్లో పంట..**

ఈ ఏడాది రెండు లక్షల ఎకరాల వరకు మిర్చి పంటను తగ్గించి రైతులు ప్రత్యామ్నాయ పంటలను వేశారు. ఆ కొరత ఉన్నప్పటికి గతేడాది నుంచి గోడౌన్‌లో ఉన్న మిర్చి కూడా అమ్ముడుపోయిన పరిస్థితి. ఏరోజు మిర్చి ఆరోజు కొనుగోలు జరుగుతోందని, మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి నైతిక స్థైర్యాన్ని ఇవ్వడంలో భాగంగా వర్తకులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించినట్లు సమాచారం.

## మొదటి పేజి తరువాయి

### బీసీ కులగణన.. దేశానికే ఆదర్శం

ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీసీ నేతలదేనని సీఎం స్పష్టం చేశారు.

**పక్కాగా బీసీల లెక్క**

తమ ప్రభుత్వం ఎన్నో జాగ్రత్తలు తీసుకుని శాస్త్రీయంగా కులగణ సర్వే నిర్వహించిందని, అయితే, ఇందులోని లోపాలను ఎత్తిచూపుతూ దీనిని బీఆర్ఎస్, బీజేపీ నేతలు వ్యతిరేకిస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఇందులో ఏమైనా లోపాలుంటే చెప్పాలని కోరితే మౌనం వహిస్తున్నారని గుర్తుచేశారు. న్యాయపరంగా ఇబ్బందులు రావొద్దనే రెండోసారి కులగణన సర్వేకు అవకాశం కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గుజరాత్ లో మోదీ హయాంలోనే బీసీలలో కొన్ని వర్గాల ముస్లింలను కలిపారని, మరి.. తెలంగాణలో కేంద్రమంత్రి బండి సంజయ్ మాత్రం అది కుదరదని మాట్లాడటమేంటని నిలదీశారు.

**కేసీఆర్ కాకి లెక్కలు**

స్వాతంత్రం వచ్చాక నేటి వరకు ఎవరూ బీసీల లెక్కలు తీయలేదని సీఎం గుర్తుచేశారు. రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాలు డిమాండ్ చేయకముందే రాహుల్ హామీ ఇచ్చారని, ఆ మాట మేరకే తాము పనిచేస్తున్నామని తెలిపారు. దేశంలో ఏ సీఎం చేయని సాహసానికి తాను పూనుకున్నట్లుగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సకలజనుల సర్వే పేరుతో కేసీఆర్ కాకి లెక్కలు చెప్పారని, అందులో ఓసీల జనాభాను 21 శాతంగా చూపగా, తమ సర్వేలో అది 17 శాతమేనని తేలిందని సీఎం వెల్లడించారు. ఆ సర్వే తప్పుల తడకగా ఉండబట్టే.. దానిని నాటి ప్రభుత్వం బయటపెట్టలేదన్నారు.

### ఎస్ఎల్‌బీసీ ప్రమాదం

ఉదయం 8.30 గంటలకు ప్రమాదం జరిగింది. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు, సైన్యం, విపత్తు నివారణా బృందాలను రంగంలోకి దించాయి.

**ఇదీ జరిగింది..**

నాలుగు రోజుల క్రితమే ఎడమవైపు సొరంగం పనులు మొదలు కాగా, ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గత మూడు రోజుల మాదిరిగానే శనివారం కూడా ఉదయం 8 గంటలకు కార్మికులు ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పనులు జరుగుతున్న చోటికి వెళ్లారు. 8.30 గంటలకు బోరింగ్ మిషన్ ఆన్ చేయగానే.. టన్నెల్‌లో ఒకవైపు నుంచి నీరు లీకై మట్టి కుంగిపోయింది. వెంటనే పెద్ద శబ్దంతో మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. టీబీఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టి మిగిలిని వారిని ఎలర్ట్ చేయటంతో 42 మంది కార్మికులు పరిగెత్తుకుంటూ బయటికి వచ్చారు. కానీ, బోరింగ్ మిషన్‌కు ముందున్న వారు మాత్రం లోపలే చిక్కుకుపోయారు.

**రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్**

కాగా, ప్రమాద స్థలిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. గతంలో ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఘటన జరిగితే టన్నెల్‌లో వారిని రెస్క్యూ చేసిన ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడామని మంత్రులు తెలిపారు. టన్నెల్‌లోని 8 మందిలో యూపీ, జార?ండ్ రాష్ట్రాలకు చెందిన ప్రాజెక్టు ఇంజినీరు, ఫీల్డ్ ఇంజినీరు, నలుగురు కార్మికులు, జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు చెందిన ఇద్దరు బోరింగ్ మిషన్ ఆపరేటర్లు ఉన్నారని మంత్రులు తెలిపారు. టన్నెల్‌లోని వారికి వెంటిలేషన్ ఇబ్బంది లేదు గానీ, 14 కి.మీ లోపల వారు ఉండిపోవటంతో వారిని వేగంగా తీసుకొచ్చే మార్గాలను అన్వేషిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. అయితే, ఆలస్యమయ్యే కొద్దీ రిస్క్ పెరుగుతుందనే వాదన వినిపిస్తోంది.

### నోరెత్తితే.. నీ చిట్టా విప్పుతా

మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్, కేటీఆర్ (ఆర్కే బ్రదర్స్) కలిసి తెలంగాణలో కుమ్మక్కు రాజకీయం నడుపుతున్నారని సంజయ్ సెటైర్ వేశారు.

**అయ్య పేరుతో.. రాలే**

కేటీఆర్‌లా తండ్రి పేరు చెప్పి తాను రాజకీయాల్లోకి రాలేదని, నమ్మిన సిద్ధాంతాల కోసం పని చేసిన వ్యక్తినన్నారు. ప్రత్యేక్ష ఎన్నికల్లో పోటీచేసి గెలిచానని గుర్తుచేశారు. తొలి నుంచి కేసులు భరించి, జైళ్లకు వెళ్లి లాఠీ దెబ్బలు తిన్నానని గుర్తుచేశారు. కేటీఆర్ ఉద్యమకారుడిలా కేటీఆర్ చెలామణి అయ్యారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దోశలు వేసి ఫొటోలకు పోజులిచ్చి ఉద్యమకారుడిగా నటించిన వ్యక్తి కేటీఆర్ అని ఫైర్ అయ్యారు. అమెరికాలో చిప్పలు కడిగి చివరలో నాయకుడి అవతారం ఎత్తాడని మండిపడ్డారు. మహేందర్‌రెడ్డికి ఇవ్వాల్సిన టికెట్ తీసుకున్నావని ఆరోపించారు.

**మందిని ముంచిన కేసీఆర్ కుటుంబం..**

ప్రజలను మోసం చేసి కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో స్థిరపడిందన్నారు. నిజమైన ఉద్యమకారులకు టికెట్ల ఇవ్వలేదన్నారు. ఇప్పుడు తోపు గాళ్లమని కొందరు మాట్లాడుతున్నారని, బయట ఈ మాట అంటే ప్రజలు రాళ్లతో కొడతారని హెచ్చరించారు. కేసీఆర్ పెద్ద అవినీతిపరుడని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆ బాటలోనే సాగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తో నిజంగా పోరాడే పార్టీ బీజేపీయేనని చెప్పారు.

### తెలంగాణలో కొలువుల జాతర

చేస్తోంది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్‌పై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం సంతకం చేశారు. మొత్తం 6399 అంగన్‌వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

**మొత్తం 14,236 పోస్టులు..**

తెలంగాణ వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో 14,236 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. 6,399 అంగన్‌వాడీ టీచర్లు, 7,837 హెల్పర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఉద్యోగాలు సైతం ఐడెంటిఫై చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోస్టులను ఆయా జిల్లా కలెక్టర్లతో జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ కోసం తెలంగాణలోని మహిళా నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులను భర్తీ చేయడం తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్‌వాడీలు మరింత పటిష్టంగా పనిచేయనున్నారు.

**ఇప్పటికే 56వేల ఉద్యోగాలు భర్తీ..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో వివిధ శాఖల్లో 56వేల ఉద్యోగాలు భర్తీ చేసింది. తాజాగా మరో భారీ నోటిఫికేషన్‌కు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మహిళా, శిశు సంక్షేమ శాఖలో కొలువుల భర్తీకి రంగం సిద్ధం చేసింది.



కేటీఆర్, కవితలతో బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్



కేటీఆర్, కవితలతో బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్

# తెలంగాణలో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ దే విజయం : రవీందర్ యాదవ్

### కేటీఆర్, కవితలను మర్యాదపూర్వకంగా కలిసిన రవీందర్ యాదవ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఏ ఎన్నిక జరిగిన బీఆర్ఎస్ పార్టీదే విజయమని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితను శనివారం రవీందర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ప్రసాదాలను కేటీఆర్, కవితకు అందజేశారు. అనంతరం శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయ పరిణామాలు, పరిస్థితులపై రవీందర్ యాదవ్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో గులాబీ జెండా విజయకేతనం ఎగరేయబోతుందని వెల్లడించారు. ఎంత మంది నేతలు పార్టీలు మారినా ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.



# ఎలక్షన్ కోడ్ ఎఫెక్ట్... మందుబాబులకు షాక్...

### అక్కడ మూడు రోజుల పాటు వైన్ షాపులు బంద్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఎఫెక్ట్ మందుబాబులకు షాక్ ఇచ్చింది. ఎన్నికలు జరుగుతున్న సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో మూడు రోజులపాటు మద్యం దుకాణాలను, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేస్తున్నట్లు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదిన మెదక్ - నిజామాబాద్- అదిలాబాద్ -కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, మెదక్ -నిజామాబాద్ -అదిలాబాద్ -కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే కొల్లూరు, రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లు మెదక్ జిల్లా పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, స్టార్ హోటల్స్‌లోని బార్‌లను ఈ నెల 25వ తేది సాయంత్రం 4 గంటల నుండి 27వ తేదిన సాయంత్రం 4 గంటలకు మూసివేస్తున్నట్లు కమిషనర్ తెలియజేశారు.

# గచ్చిబౌలి డివిజన్ లో రూ.83.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

### శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్దే ధ్యేయం : ఎమ్మెల్యే గాంధీ

### ప్రణాళికబద్ధంగా గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లో నూతన అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపన చేశారు. గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 83.80 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. గుల్మోహర్ పార్క్ కాలనీలో 14.80 లక్షల రూపాయలతో, నేతాజీ నగర్ కాలనీలో 20 లక్షల రూపాయల వ్యయంతో, గోపనపల్లిలో గల సిపిఆర్ బెల్లా విస్టా నుండి నల్లగండ్ల మెయిన్ రోడ్డు వరకు 49 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ప్రజలకు అవసరమైన పూర్తి మౌలిక వసతులను వారికి చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి చేపడుతున్నామని అన్నారు. డివిజన్ ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి కోట్లాది రూపాయల నిధులతో పనులు చేపడుతున్నామని తెలిపారు. దీంతో పాటు డివిజన్ ప్రజల సౌకర్యం కోసం పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ, రహదారుల విస్తరణ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో గచ్చిబౌలి డివిజన్ ను గ్రేటర్ హైదరాబాద్ లోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# కొండాపూర్ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన వైద్య విధాన పరిషత్ కమిషనర్

**ఈ/కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జె అజయ్ కుమార్ శనివారం కొండాపూర్ లోని జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మొత్తం పరిశీలించిన కమిషనర్ ఆసుపత్రిలో వైద్య సేవలపై డాక్టర్లు, రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్ బి ఎస్ కే స్కూల్ విద్యార్థుల కంటి స్క్రీనింగ్ శిబిరాన్ని కమిషనర్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండాపూర్ ఆసుపత్రి సూపరింటెంట్ అనురాగిణి రెడ్డి స్క్రీనింగ్ శిబిరానికి సంబంధించిన వివరాలను కమిషనర్ అజయ్ కుమార్ కు తెలియజేశారు. సూపరింటెంట్ అనురాగిణి రెడ్డి మాట్లాడుతూ స్కూల్ విద్యార్థుల స్క్రీనింగ్ లో రంగారెడ్డి జిల్లా 1149 లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. శనివారం నాటికి 419 స్క్రీనింగ్ లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 215వ శిబిరం ఫిబ్రవరి 28వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా విశిష్ట సేవలను అందించిన డాక్టర్లు, నర్సులు, శానిటేషన్ వర్కర్లను అభినందిస్తూ ఉత్తమ సేవా అవార్డులను కమిషనర్ అందజేసినట్లు తెలిపారు.



విద్యార్థుల కంటి స్క్రీనింగ్ శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

# చేతబడి చేపిస్తున్నాడని వ్యక్తిని కర్రలతో కొట్టి చంపిన స్నేహితులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
చేతబడి చేపిస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని అతని స్నేహితులే కర్రలతో కొట్టి చంపారు. మాట్లాడుకుందామని బయటకు తీసుకువెళ్లి మద్యం మత్తులో స్నేహితునిపై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇనిస్పెక్టర్ పాలవెల్లి తెలిపిన ప్రకారం... లింగంపల్లి నెహ్రూనగర్ లో నివాసం ఉంటున్న నసీరుద్దీన్(41) కార్? డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నసీర్ చేతబడి చేపిస్తున్నాడని అదే కాలనీలో ఉండే స్నేహితుడు ఫక్రుద్దీన్ అనుమానం పెంచుకున్నాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో నసీరుద్దీన్ ఇంటికీ వచ్చిన ఫక్రుద్దీన్ మాట్లాడేది ఉందని చెప్పి బయటకు తీసుకెళ్లాడు. వీరు ఇద్దరు స్థానికంగా ఉన్న గోపి చెరువు వద్దకు వెళ్లగా, అక్కడ మరో ముగ్గురు స్నేహితులు ఉన్నారు. అందరూ కలిసి చెరువు వద్ద మద్యం తాగారు. తాగిన మత్తులో చేతబడి విషయమై మాట్లాడుతూ నసీరుద్దీన్‌ను భయపెట్టేందుకు కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నసీరుద్దీన్ స్పృహ కోల్పోయాడు. చికిత్స నిమిత్తం నసీరుద్దీన్ ను కొండాపూర్‌లోని జిల్లా హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నసీరుద్దీన్ ఒంటిపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు ఫక్రుద్దీన్ తో పాటు అతని స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు నసీరుద్దీన్ (ఫైల్ ఫోటో)

## అమరావతి నిర్మాణ పనులకు ముమూర్తం ఖరారు

**అమరావతి:** రాజధాని అమరావతి పనుల ప్రారంభానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న వేళ కీలక సమాచారం వచ్చేసింది. మార్చి 15 నుంచి రాజధాని పనులు ప్రారంభంకానున్నట్లు వెల్లడించింది. . ఏప్రిల్ మొదటి వారం నుంచి అమరావతిలో 30 వేల మంది కార్మికులు పనులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో టెండర్లు ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఏ, ఏడీసీ టెండర్లను పిలిచింది. సుమారు 40 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల పక్రియ కొనసాగుతోంది. మరో 11 పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టు తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ నిలిచి పోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి డోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది. లాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చారు. దాదాపు 40 వేల కోట్లకు సంబంధించి 62 పనులపై మార్చి 15 నుంచే శ్రీకారం చుట్టనున్నారు. మిగిలిన 11 పనులకు త్వరలో టెడర్లను పూర్తి చేసి రెండున్నరేళ్లలో అమరావతి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## మహిళలకు నెలనెలా...2500 పథకం

### చర్చించేందకు అవకాశం ఇవ్వండి

### సిఎం రేఖాగుప్తాకు మాజీ సిఎం అతిషి లేఖ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అతిషి లేఖ రాశారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే పథకం గురించి చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 23న ఆప్ శాసనసభా పక్షాన్ని కలవడానికి సమయం ఇవ్వాలని లేఖలో రేఖా గుప్తాను కోరారు. ఈనెల 20నే ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. సాయంత్రం కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి ఆయుష్మాన్ భారత్ పథకంపై నిర్ణయం తీసుకున్నారు. ఇక రేఖా గుప్తా ప్రమాణస్వీకారం రోజునే అతిషి ప్రెస్‌మీట్ పెట్టి.. తొలి కేబినెట్‌లోనే మహిళలకు రూ.2,500 పథకంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు కదా? అని నిలదీశారు. ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. దీనిపై శుక్రవారం రేఖా గుప్తా స్పందిస్తూ.. ఒక్క రోజు కాకముందే అతిషి విమర్శలు చేస్తున్నారంటూ తప్పుపట్టారు. కాంగ్రెస్, ఆప్ పాలించిన రోజులు గుర్తుచేశారు. మీరేం చేశారంటూ రేఖా గుప్తా తిరిగి ప్రశ్నించారు. తాజాగా మరోసారి అతిషి.. మహిళలకు రూ.2,500 పథకం గురించి లేఖ రాశారు. దీనిపై రేఖా గుప్తా ఎలా స్పందిస్తారో చూడాలి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 48, ఆప్ 22 సీట్లు సాధించాయి. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో కాషాయ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. అనూహ్యంగా రేఖా గుప్తాకు ముఖ్యమంత్రి పదవి దక్కింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. ఆర్ఎస్ఎస్‌తో మంచి సంబంధాలు ఉండడంతో అవకాశం దక్కినట్లుగా వార్తలు వినిపించాయి.

## యూట్యూబ్ ఛానల్ ముసుగులో వ్యభిచారం

**విజయవాడ:** విజయవాడలో యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నిర్వహిస్తున్న బిల్డింగ్‌పై మాచవరం పోలీసులు దాడి చేశారు. వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్డులో స్టూడియో 9 ( స్పా) సెంటర్‌పై సహచర సిబ్బందితో కలిసి మాచవరం సీఐ ప్రకాష్ దాడులు చేశారు. ఏపీ 23 యూట్యూబ్ ఛానల్ న్యూస్ బిల్డింగ్ నందు స్పా సెంటర్ నడుపుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు రైడ్ చేశారు. 10 మంది మహిళలు, 13 మంది విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్.. యూట్యూబ్ ఛానల్‌ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం భార్గవ్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానున్న జగన్

**అమరావతి:** అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని వైకాపా అధినేత జగన్ నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం గవర్నర్ ప్రసంగానికి హాజరుకానున్నారు. మంగళవారం నుంచి శాసనసభకు హాజరుపై జగన్ ఇంకా నిర్ణయానికి రాలేదని సమాచారం. శాసనసభకు, బడ్జెట్ సమావేశాలకు రావడంపై పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది. ఈనెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. 24న ఉదయం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 28న 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముంది. 15 పనిదినాలు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి రోజు బీఏసీ తర్వాత సభ ఎన్ని రోజులు జరపాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు.

## ఎపికి ఇద్దరు ఐపిఎస్ అధికారులు

### అంజనీకుమార్, అభిలాష్ బిస్త్‌ల రిలీవ్

**హైదరాబాద్:** ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష్ బిస్త్‌ను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఏపీలో చేరేందుకు వీలుగా వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. కరీంనగర్‌లో ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఈసీని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. రహదారి భద్రత అథారిటీ ఛైర్మన్ అంజనీకుమార్(1990), తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్(1994), కరీంనగర్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి(2011)లు ఏపీకి వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2014లో ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ)... రెండు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించడం.. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేయడం వంటి పరిణామాలు జరిగాయి. చివరకు 2024లో నియమించిన ఖండేకర్ కమిటీ సిఫార్సుల మేరకు ఇప్పుడు ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

## టన్నెల్ ప్రాంతంలో సహాయక చర్యలు

**నాగర్‌కర్నూల్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రమాద స్థలిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు.'ఉదయం 8గంటలకు కార్మికులు టన్నెల్ లోపలికి వెళ్లారు. 8.30గంటలకు బోరింగ్ మిషన్ ఆన్ చేశారు. టన్నెల్‌లో ఒకవైపు నుంచి నీరు లీకై మట్టి కుంగి పెద్ద శబ్దం వచ్చింది. టీబీఎం ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టారు. వెంటనే అప్రమత్తమై 42 మంది కార్మికులు బయటకు తీసుకొచ్చారు. బోరింగ్ మిషన్ ముందున్న 8మంది చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. 8మంది ప్రాణాలు కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాం. ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఘటన జరిగితే టన్నెల్‌లో వారిని రెస్క్యూ చేసిన ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడాం. టన్నెల్‌లో చిక్కుపోయిన వారు ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్ వాసులు. వారిలో ఒక ప్రాజెక్టు ఇంజినీరు, ఫీల్డ్ ఇంజినీరు, నలుగురు కార్మికులు, జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు చెందిన ఇద్దరు బోరింగ్ మిషన్ ఆపరేటర్లు ఉన్నారు.

# మన దేశ వ్యవహారాల్లో వేలు పెడుతున్నదెవరు

స్వాతంత్ర్యానంతరం మనం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. ఇటీవల మళ్లీ అలాంటి కుయుక్తులు సాగుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. మనదేశ అంతర్గత వ్యవహారాల్లో బైడెన్ ప్రభుత్వం జోక్యం చేసుకున్నట్లు వెల్లడయ్యింది. అదికూడా ఎన్నికల వ్యవహారంలో తలదూర్చి నిధులు కేటాయించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడ ఓ విషయం గమనిస్తే..కాంగ్రెస్ నేత రాహుల్ గతంలో అమెరికాలో పర్యటించారు. ఆయన అక్కడే ఉండి మనదేశ అంతర్గత వ్యవహారాలపై అనేకం మాట్లాడారు. ఆ తరవాతే ఆదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చింది. ఇప్పుడు ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఈ రెంటికీ ఏమైనా సంబంధం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వీటిని జాగ్రత్తగా గమనిస్తే అనుమానాలు ఉన్నట్లు రాజకీయ నిపుణులు కూడా భావిస్తున్నారు. అయితే అంతర్గ వ్యవహారాల్లో దూరి దేశాన్ని అస్థిరపరచాలన్న చీప్ ట్రిక్స్ ఆడారా అన్నది మున్ముందు తేలనుంది. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికీ అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్దంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెరికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మ స్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అస్థిరపరచే చర్యలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇలాటి వారిపై కఠినంగా ఉండాల్సిందే. నిజానికి మనం ఏ దేశంలోనూ వేలుపెట్టే అవకాశం తెచ్చుకోం. ఇతరులు జోలికి వస్తే ఊరుకోం. ఏ దేశానికైనా



పటిష్టమైన విదేశాంగ విధానం ఉండాలి. ప్రపంచ దేశాల్లో ఇదే ముఖ్యం. ఇతర దేశాలు కష్టసమయాల్లో ఉంటే ఆదుకోవాలి. అన్నార్తులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. ఇరుగుపొరుగుతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ముందునుంచీ మనం పాటిస్తున్నాం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే..సర్వస్వతంత్రంగా మనగలగేలా మన గత పాలకులు, ప్రస్తుత పాలకులు వ్యవహరిస్తున్నారు. గతంలో పాక్ మంత్రులు పలువురు ఇలాగే ప్రేలారు. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే రకంలో పాక్ ముందుంటుంది. ఇప్పుడు బంగ్లా తోడయ్యింది. బిబిసి కూడా అడపాదడపా తన కుట్రలను వెల్లడిస్తోంది. మొన్నటికి మొన్న మాజీ చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ ఇంటర్వ్యూలో కూడా బిబిసి అడిగిన ప్రశ్నలు దాని కుత్సిత స్వభావాన్ని బయటపెట్టాయి. ఆదానీ విషయంలో కూడా అమెరికా హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను గర్హించాల్సిందే. దేశంలో మనం నిలదీయాల్సిన సమస్యల్లో విదేశీయులను తలదూర్చేలా చేయడం వల్ల అంతర్జాతీయంగా మనపరువును మనమే పోగొట్టుకున్న వారం అవుతాం. నిజానికిమోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. కరోనా సమయంలో అనేక పేద దేశాలకు ఉచితంగా వ్యాక్సిన సరఫరా చేసి వారికి అండగా నిలిచారు. అలాగే టర్కీ, సిరియా భూకంప బాధితులకు అండగా నిలిచిన మన బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. గత పదేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించుకునేలా చేశారు. విదేశాగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలతోపాటు చైనాతో కూడా సత్సంబధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారతదేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్ళెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని,మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారా లను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకపోవడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణా మాలు భారత్‌కు అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా అండదండలు బలంగా లభించాయని స్పష్టమవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ఈ రకమైన మద్దతు ద్వారా మనదేశ ప్రతిభ విస్తరించడమే గాకుండా ప్రపంచంలో మనకు పెద్దన్న పాత్రను కట్టబెడుతున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందులో అమెరికా కూడా ఉంది. అందుకే అమెరికాలో మోదీ పర్యటించినప్పుడల్లా ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఇరు దేశాల్లో గతంలో ఎన్నడూ లేనంత చెలిమి నెలకొంది. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ - అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి. ఉగ్రవాదం,ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం,ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా భారత్‌లు ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా,చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతి పెద్ద వినియోగ మార్కెట్, బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లనయినా తిప్పికొట్టగలగాలి.

# మారని ఎయిర్ ఇండియా తీరు

### విరిగిన సీట్లో గంటన్నర ప్రయాణించా

### కేంద్రమంత్రి చౌహాన్ అసహనం

**న్యూఢిల్లీ:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా తీరుపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మండిపడ్డారు. టాటాల చేతికి వచ్చినా పనితీరులో మార్పు రాలేదని అన్నారు. ఇంత అధ్వానంగా ఉంటుందని ఊహించలేక పోతున్నానని అన్నారు. ఇటీవల భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సందర్భం లో తనకు విరిగిపోయిన సీటు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ప్రయాణికులను మోసం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నానని.. కానీ అది తన అపోహనని అర్థమయ్యిందని మంత్రి అసహనం వ్యక్తంచేశారు. విమానం ఎక్కిన వెంటనే నేను బుక్ చేసుకున్న సీటు విరిగి ఉండడంతో ఆశ్చర్యపోయాను. దీనిపై ఎయిర్‌లైన్స్ సిబ్బందిని ప్రశ్నించగా.. ఈ సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించిందని..ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. విమానంలో అదొక్కటే కాకుండా మరిన్ని సీట్లు కూడా సరిగా లేవని సిబ్బంది చెప్పారని కేంద్రమంత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోమని ఆఫర్ చేశారని అన్నారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక తాను అదే విరిగిపోయిన సీట్‌లోనే గంటన్నర పాటు కూర్చొని ప్రయాణించానని తెలిపారు. ప్రయాణికుల నుంచి పూర్తి ఛార్జీలు వసూలు చేసి, అసౌకర్యమైన సీట్లు కేటాయించడం ప్రయాణికులను మోసం చేసినట్లు కాదా అని మండిపడ్డారు. భవిష్యత్తులో అయినా ఎయిర్ ఇండియా యాజమాన్యం తమ ప్రయాణికులను ఇటువంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకుంటుందా లేదంటే వారి అవసరాన్ని సొమ్ము చేసుకోవడానికి వాడుకుంటుందా అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి ట్వీట్‌పై ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ.. ఆయనకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. 1932లో టాటా గ్రూప్ టాటా ఎయిర్ సర్వీసెస్ పేరుతో ఎయిర్ ఇండియాను స్థాపించగా.. స్వాతంత్ర్యం÷-ర వచ్చాక 1953లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ సంస్థను జాతీయం చేశారు. సుమారు 69 ఏళ్ల తర్వాత 2022లో ప్రభుత్వం విమానయాన సంస్థ ఎయిరిండియాను టాటా గ్రూప్‌నకు అధికారికంగా అప్పగించింది.

## మనసులో మాలిన్యం ప్రమాదం

**తిరుమల:** మన ఆలోచనల్లో స్వచ్ఛత లేకపోతే, ఎన్ని ఆలయాలు సందర్శించి, ఎంతమంది దేవుళ్లను మొక్కుకున్నా లాభం లేదు. మాలిన్యంతో దేవుడిని పూజించినా ఫలితం ఉండదు. మరకత మాణిక్యాలతో అలంకరించి, సుగంధ పూలతో, వేద మంత్రాలతో పూజించినా పుణ్యం సంప్రాప్తించదు. మనసులో మాలిన్యం పెట్టుకుని స్వార్థంతో వ్యవహరించే వారిని భగవంతుగు కూడా దగ్గరకు రానీయడు. సమస్త జీవరాశి పట్ల కారుణ్య భావన కలిగి ఉండాలంటారు ద్రష్టలు. సాటి మనుషులను చిన్న చూపు చూసే మానవులు, జీవ జంతుజాలం పట్ల ఉదాత్తంగా, సమదృష్టితో ఎలా వ్యవహరించగలరు? ఈ భూమ్మీదకు వచ్చిన వాళ్లందరూ రక్తసంబంధం లేకపోయినా, మనకు భ్రాతృ సమానులే. అందరిలో తనను చూసుకునే వ్యక్తి ఉన్నత వ్యక్తిత్వం గల ఉత్తముడు. వయసుతో పాటు మనసు పరిధి విస్తృతం కావాలి. భూమ్మీద ముక్తి సంపాదించుకునే మార్గాలు ఇన్ని ఉన్నా, కారుచీకట్లో కొట్టుమిట్టాడటం మనిషికే చెల్లింది.'ఎక్కడో ఏదో ఉందని కాక, ఇక్కడే భూమ్మీద, ఈ జన్మతో దాన్ని సాధించడమే జన్మ సార్థకత' అని తెలుసుకుంటే ముముక్షు భావనలు మనలో అంకురించినట్లే! ప్రతి మనిషిలోనూ ఈ మానవత్వ భావనలు వెల్లివిరిస్తే, భూలోకమే ముక్తిదాయక వనం. సర్వత్రా పరిశుద్ధాత్మలు సంచరించే పుణ్యస్థలమై స్వర్గతుల్యమై విలసిల్లుతుంది. సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తిని అంతా పాటించాలి.

# గ్రామాల్లో కోతుల బెడద..నగరాల్లో కుక్కల బాధ

### పిల్లలు,మహిళలు, వృద్దులు స్వేచ్ఛగా వెళ్లలేని పరిస్థితి

**హైదరాబాద్:** గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. పంటలను నాశనం చేస్తున్నాయి. ప్రజలమీద పడి రక్కుతున్నాయి. గ్రామాల్లో ప్రజలు తమ ఇంటిని ఓ జైలులాగా గ్రిల్స్‌తో నిర్మించుకుంటున్నారు. స్థానిక ఎన్నికల మడావిడిలో ఇప్పుడు చాలామంది కోతుల సమస్యను తెరపైకి తెస్తున్నారు. కోతుల నిర్మూలనకు ఏం చేస్తారో చెప్పాలని అడుగుతున్నారు. అయితే అటవీ అధికారులు మాత్రం ఇన్నేళ్లయినా కోతులను తరలించే చర్యలు చేపట్టలేదు. గతంలో కెసిఆర్ సిఎంగా ఉన్న సమయంలో కోతులు వాపస్ పోవాలని నినాదం ఇచ్చారు. ఆయన పోయారు తప్ప, కోతులు మాత్రం అక్కడే ఉన్నాయి. పాలకుల్లో చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనం. అలాగే రేవంత్ సర్కార్ కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఏనాడూ ఈ సమస్యపై కనీస విచారణ కూడా చేయలేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడం..తరవాత మిన్న కుండడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. అగ్నిప్రమాదాలు, బస్సుల ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, కాలువల్లో కొట్టుకు పోవడం,



వీధికుక్కల బారిన పడడం వంటి అనకానేక ప్రమాదాల సందర్భంగా జరుగుతున్న తీరు ఇందుకు నిదర్శనంగా చూడాలి. ప్రమాదాలు జరగ్గానే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడం, మళ్లీ మరచి పోవడం..జరుగుతోంది. యథారాజా తథా ప్రజ అన్న చందంగా అధికారుల తీరు ఉంటోంది. అధికారులు అప్పటికప్పుడు హడావిడి చేయడం తప్ప మరోటి కానరావడం లేదు. ఎపిలో గ్యాస్ లీక్ ప్రమాదాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ క్రమంలో హైదరాబాద్ నగరంలో కుక్కల గుంపులు అనేకమందిని బలి తీసుకున్నాయి. ఉదయం ఒంటరిగా వెళ్లలేని పరస్థితి ఉంది. నగరంలో దాదాపు 4 లక్షల 61 వేల కుక్కలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే వీటికి తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా మరో ఐదు లక్షలు ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉంటాయని తెలుస్తోంది. ఇందులో జర్మన్ షెఫర్డ్, డాబర్మెన్ లాంటిలాంటి భయంకరమైన కుక్కులు కూడా ఉన్నాయి. ఈ కుక్కలన్నీ వీధుల్లో తిరుగుతూ.. సామాన్య ప్రజలకు భయ భ్రాంతులను కలిగిస్తున్నాయి. అలాగే కుక్కల దాడితో ప్రమాదాలు జరుగతున్న ఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు చేస్తున్న ఖర్చు వల్ల ప్రభుత్వ ఖాజానా గుల్ల అవుతోందే తప్ప లక్ష్యం నెరవేరడం లేదని హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె. కాశీనాధ్ గతంలో అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చారు. కుక్కలు పరుగెత్తుకుని వస్తున్న సందర్భాల్లో టూవీలర్‌పై పోతూ కిందపడి దెబ్బలు తాకిన వారు, ప్రమాదాలకు గురయిన వారు అనేకులు ఉన్నారు. అలాగే నడకదారిలో ఇవి అడ్డగించి కరుస్తున్న కేసులు అనేకం ఉన్నాయన్నారు. పిల్లలు వీధుల్లో లేదా పార్కుల్లో స్వేచ్ఛగా ఆడుకునే పరిస్థితి నగరంలో లేదు. మహిళలు, వృద్దులు ధైర్యంగా రోడ్డుపై అడుగు పెట్టకుండా కుక్కలు అడ్డుకుంటున్నాయి. ఇకపోతే వీధికుక్కలకు తోడు పెంచుకుంటున్న కుక్కలు కూడా రోడ్లపైనే మల మూత్రాలు పోయడం వల్ల వీధులు ఖరాబు అవుతు న్నాయని, వాటిని క్లీన్ చేయడం పారిశుధ్య సిబ్బందికి కూడా సమస్యగా ఉంది. కుక్కల పెంపకందారులు నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే వాటిని మలమూత్రాలకు వదిలేస్తున్నారు. పెట్ డాగ్స్‌కు లైసెన్స్ తప్పనిసరి చేసి,నిబంధనల మేరకు పెంచుతున్నారా లేదా అన్నది కూడా చూడాల్సి ఉంది. కుక్కల కోసం నగర శివార్లలో సషెల్టర్లు ఏర్పాటు చేసి, స్టెరిలైజ్ చేయడం వల్ల మంచి ఫలితాలతో పాటు డాగ్ లవర్స్‌కు కూడా వాటిని రక్షించుకునే అవకాశం ఉంటుంది. నగరంలో ఉన్న వీధికుక్కల్లో 75 శాతం కుక్కలు అంటే 3 లక్షల20 వేల కుక్కలకు స్టేరిలైజేషన్ పూ ర్తి చేశామని బల్దియా వెటర్నరీ ఆఫీసర్లు చెబుతున్నారు.

## కేక పుట్టిస్తున్న ఓదెల 2 టీజర్



హైదరాబాద్: మిల్కీ బ్యూటీ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఓదెల 2. నాలుగేళ్ల నాడు(2021) విడుదలైన 'ఓదెల రైల్వే స్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతుంది. అశోక్ తేజ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సూపర్ నాచురల్ థ్రిల్లర్ కోసం టాలీవుడ్ దర్శకుడు సంపత్ నంది కథను అందించగా, మధు క్రియేషన్స్ మరియు సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్లపై డి. మధు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో తమన్నా నాగ సాధువుగా కనిపించనుంది. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ శనివారం మహా కుంభమేళాలో విడుదల చేశారు. ఓదెల గ్రామాన్ని దుష్ట శక్తుల నుంచి నాగ సాధువైన తమన్నా ఎలా రక్షిస్తుందనే కథాంశంతో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇక టీజర్ బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే శివ భక్తి గీతం గుస్‌బంప్స్ తెప్పిస్తోంది.

## చిరు చేతుల మీదగా హిచ్‌కాక్ బుక్ రిలీజ్



హైదరాబాద్: ప్రపంచ సినిమాపై తన ముద్రను వేసిన గొప్ప దర్శకుల్లో ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ ఒకరు. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలు తీసే దర్శకులకు నేటికీ ఆయన మూవీలు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. కాగా, హిచ్‌కాక్ 125వ జయంతి, ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లైన సందర్భంగా హిచ్‌కాక్ సినీ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్ పులగం చిన్నారాయణ, ఐఆర్‌టీఎస్ అధికారి రవి పాడి కలిసి ఈ పుస్తకం తీసుకొచ్చారు. ఈ పుస్తకం డిసెంబర్ 18న రిలీజ్ కాగా, 5 రోజుల్లో ఆ కాపీలన్నీ అమ్ముడైపోవటంతో తాజాగా సరికొత్త చేర్పులతో సెకండ్ ఎడిషన్ తీసుకువచ్చారు. దానిని మెగాస్టార్ చిరంజీవి శనివారం రిలీజ్ చేశారు. కాలేజీ రోజుల్లో ఆయన సినిమాలు చూశానని, ఈ పుస్తకాన్ని తప్పక చదువుతానని చిరు తెలిపారు. పుస్తక రచయితలను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

## రావణుడి గెటప్‌లో యశ్..

హైదరాబాద్: కేజీఎఫ్ మూవీతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన నటుడు.. యష్. ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ హీరో ప్రస్తుతం 'టాక్సిక్'మూవీలో నటిస్తున్నాడు. అలాగే, బాలీవుడ్ దర్శకుడు అతి భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న 'రామాయణ' మూవీలోనూ యశ్ రావణుడి పాత్రలో కనిపించనున్నాడు. రణబీర్ కపూర్, సాయిపల్లవి ఇందులో సీతారాములుగా కనిపించనున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీలో తన పాత్రకోసం తాజాగా యశ్ సైతం లోకేషన్‌లో అడుగుపెట్టారు. ఈ షూట్‌లో లీకైన కొన్ని ఫోటోల్లో అసలైన రావణుడిగా కనిపిస్తున్న యశ్ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఖుష్ అవుతున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న రామాయణ మూవీ.. తొలి భాగం 2027 దీపావళి రోజున విడుదల కానుందని మూవీ టీమ్ ఇప్పటికే ప్రకటించింది.



## ఆగస్ట్ 1న రిలీజ్ కానున్న 'మిరాయ్'

హైదరాబాద్: 'హనుమాన్' మూవీతో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటుడు తేజ సజ్జా. అతను హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం..'మిరాయ్'. ఈ పాన్ ఇండియా మూవీ టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే విడుదలై, సినిమాపై మంచి హైప్ క్రియేట్ చేశాయి. కాగా, 'మిరాయ్' సినిమా ఏప్రిల్ 18న రిలీజ్ కావాల్సి ఉండగా, దానిని ఆగస్టు 1న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. కళింగ యుద్ధం తర్వాత ఆవిర్భవించిన ఓ యోధుడి కథే.. మిరాయ్. ఇందులో తాజా టైటిల్ రోల్ పోషిస్తుండగా, రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి గౌర హరి సంగీతం అందిస్తుండగా, ప్రధాన భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేయబోతున్నారు.




## దాయాది పోరులో గెలుపెవరిదో?

న్యూఢిల్లీ : క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న దాయాది పోరుకు సర్వం సిద్ధమైంది. నేడు ఛాంపియన్స్ ట్రోఫీ2025లో భాగంగా భారత్, పాక్ జట్లు దుబాయ్ వేదికగా బరిలో దిగనున్నాయి. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై తమదేశం పైచేయి సాధిస్తుందని ఈ కప్‌కు ఆతిథ్యం ఇస్తున్న పాక్ జట్టు ధీమా వ్యక్తం చేస్తుండగా, ఆరునూరైనా దాయాదిని మట్టికరిపిస్తామని టీమిండియా చెప్పుకొస్తోంది. చరిత్ర పరిశీలిస్తే.. భారత్, పాక్‌ల మధ్య ఇప్పటికి 135 సార్లు పోరు జరగగా, ఇందులో భారత్ 57 సార్లు గెలవగా, 73 మ్యాచ్‌లలో పాక్ సత్తా చాటింది. మరో.. 5 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. ఇక.. ఛాంపియన్స్ ట్రోఫీ విషయంలోనూ.. భారత్‌పై పాక్ స్వల్ప ఆధిక్యత కలిగి ఉంది. ఈ మెగా టోర్నీలో ఇరు జట్లు ఇప్పటివరకు ఐదు సార్లు తలపడగా, పాక్ 3, భారత్ 2 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.



## కొత్త గర్ల్‌ఫ్రెండ్‌తో శిఖర్

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ కొత్త గర్ల్‌ఫ్రెండ్‌తో చక్కర్లు కొడుతున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయ్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్ సమయంలో.. ప్రేక్షకుల గ్యాలరీతో కొత్త గర్ల్‌ఫ్రెండ్‌తో ధావన్ కనిపించాడు. ఆ అమ్మాయి పేరును సోఫీ షైన్‌గా గుర్తించారు. ఆమె ఐర్లాండ్ దేశస్థురాలు అని తెలిసింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను ధావన్ ఫాలో అవుతున్నట్లు ఆన్‌లైన్ యూజర్లు గుర్తించారు. ఆమె ప్రొడక్ట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ధావన్, సోఫీ మధ్య ఉన్న రిలేషన్ ఏంటనేది తెలియదు గానీ, ప్రస్తుతం వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని తెలుస్తోంది. గతంలో వీరిద్దరూ ఓ సారి విమానాశ్రయంలో కనిపించారు.దీంతో, మూడేళ్ల క్రితం ఆస్ట్రేలియా మహిళకు విడాకులు ఇచ్చిన ధావన్ మళ్లీ పర్సనల్ లైఫ్‌లో బిజీ అయినట్లు నెటిజన్లు భావిస్తున్నారు.



## ఆ ఇద్దరితో జాగ్రత్త...విరాట్



న్యూఢిల్లీ : ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా నేడు జరగనున్న భారత్ – పాక్ మధ్య మ్యాచ్ కు అంతా సిద్ధమైపోయింది. ఈ సమయంలో పాకిస్తాన్ ప్లేయర్స్ పేసర్ హారిస్ రవూఫ్, కొత్త స్పెషలిస్ట్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ నుంచి కోహ్లీకి కాస్త ముప్పు ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టీ20ల్లో రవూఫ్ పై మంచి రికార్డు ఉన్న కోహ్లీకి.. వన్డేలో మాత్రం లేదు. ఇక విరాట్ స్పిన్ ఆడటంతో ఇబ్బందిపడుతూ పెవిలియన్ చేరుతున్నాడు. కాబట్టి ఇప్పుడు విరాట్ వీరిని ఎలా డీల్ చేస్తాడో అనే టెన్షన్ కోహ్లీ అభిమానుల్లో నెలకొంది.

## వచ్చే కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం



న్యూఢిల్లీ : ఒలింపిక్స్2036 ఆతిథ్య హక్కుల కోసం భారత్ యత్నిస్తున్న భారత్.. ఆ క్రీడల కంటే ముందు కామన్వెల్త్ గేమ్స్2030కి ఆతిథ్యమిచ్చి సత్తా చాటాలని భావిస్తోంది. 'కామన్వెల్త్ గేమ్స్2030 నిర్వహణకు మేం రెడీగా ఉన్నాం. కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్‌తో ఇప్పటికే ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ చర్చలు జరిపింది. అలాగే, కామన్వెల్త్ గేమ్స్2026 నుంచి తొలగించిన క్రీడలను భారత్‌లో నిర్వహిస్తామని ప్రతిపాదించాం.'అని కేంద్ర క్రీడాశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, హోస్టింగ్ రైట్స్ కోసం బిడ్ వేయడానికి మార్చి 31 చివరి తేదీ కావటంతో క్రీడా మంత్రిత్వ శాఖ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. కాగా, 2010లో కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యమిచ్చిన విషయం తెలిసిందే.